సాక్షి ప్రకాశం

గురువారం । 19 । జనవరి । 2023



చోరీ కేసులో దొంగకు సంకెళ్లు

గిద్దలూరులో ఆర్మీ జవాను ఇంట్లో చోరీ చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో..



కానిస్టేబుల్ పరీక్షకు పక్కా ఏర్పాట్లు

ఈనెల 22న మార్కాపురంలో నిర్వహించే కానిస్టేబుల్ అర్హత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29 /18

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

రహదారుల భద్రత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

- పలు క్యాలెండర్‌లు, డైరీలు ఆవిష్కరించిన కలెక్టర్



ప్రచార కరపత్రాలు, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్లపై సూచిక బోర్డులు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. దీనిలో రోడ్డు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. దీంతో పాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీ, వ్యవసాయ శాఖ రూపొందించిన క్యాలెండర్, డైరీలను కలెక్టర్ ఆవిష్కరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ ఓబులేసు, వ్యవసాయ శాఖ అధికారులు, ఏపీ ఆర్‌ఎస్‌ఏ నాయకులు ఆర్‌వీఎస్ కృష్ణ మోహన్, రవిశంకర్, దానియేలు, ఊతకోలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరాజు, కాశీ, రజని, ముస్తక్, రామ్‌నారాయణరెడ్డి, గౌతమి, ప్రియాంక, హరిత, శృతి, జాహ్నవి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ట్ కులాల సంక్షేమ సంఘం నూతన సంవత్సరం -2023 క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సంఘ నాయకులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పైనం మల్లిఖార్జునరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మున్నంగి రాజకుమారి, నాయకులు సీహెచ్ రమేష్ బాబు, ఆదిమూలపు దివాకర్, దుడ్డు ప్రభాకర్, గెల్లా కోటేశ్వరరావు, పాముల అంజయ్య, దాసరి నరశింహారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

'బండి'కి మద్దతుగా తరలిన ఎన్జీవో సంఘ నేతలు



బండి శ్రీనివాసరావుకు మద్దతుగా బయలు దేరిన జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అందులో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు నామినేషన్ వేయనున్నారు. అందుకుగాను బండి శ్రీనివాసరావుకు మద్దతు తెలుపుతూ జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు బుధవారం ఒంగోలు నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. బండి శ్రీనివాస రావుతో పాటు ప్రధాన కార్యదర్శిగా కేవీ.శివారెడ్డికి కూడా మద్దతు తెలుపుతున్నారు. మద్దతు తెలిపిన వారిలో ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచిపూడి శరత్ బాబు, ఆర్‌సీ హెచ్.కృష్ణారెడ్డిలతో పాటు జిల్లా కమిటీ, తాలూకా కమిటీ నాయకులు ఉన్నారు.

23న ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కరాటే జట్ల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ కరాటే జిల్లా స్థాయి అండర్ 14, 17, 19 బాలబాలికల జిల్లా కరాటే జట్ల ఎంపిక ఈనెల 23న స్థానిక శ్రీప్రతిభ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు సీహెచ్ సుబ్బారావు, యం.ఆదినారాయణ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందని, కరాటే ఎంపికకు వచ్చే క్రీడాకారులు తమ కరాటే డ్రస్సు, సేఫ్టీ పరికరాలు (కుముతే కిట్) వెంట తీసుకురావాలన్నారు. వాటితోపాటు తమ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో కరాటే జిల్లా కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు వద్ద రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 9885208991 ను సంప్రదించాలన్నారు. కరాటే ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

పొలం గట్టున పొంచిన గండం

మార్కాపురం డివిజన్‌లోని నల్లమల సమీప గ్రామాల్లో పాముల బెడదతో రైతులు వణికిపోతున్నారు. అటవీ ప్రాంతాల నుంచి జనావాసాల్లోకి వస్తున్న సర్పాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాములను చంపకుండా వాటిని జాగ్రత్తగా పట్టుకుని అడవిలో వదిలేసేందుకు అటవీశాఖ స్నేక్ వాచర్‌లను నియమించి.. వందల సంఖ్యలో పాముల్ని రక్షించి వాటి ఆవాసాలకు చేరుస్తోంది.



పొలంలో ఉన్న రక్తపింజర



కొండచిలువను పట్టుకున్న నిరంజన్



నీరు కట్టుపాము

నల్లమల సమీప గ్రామాల పొలాల్లో పెరిగిన పాముల సంచారం

- రక్తపింజర, కొండచిలువలు కోకొల్లలు
- జనావాసాల్లోకి వస్తున్న సర్పాలు
- రెండు నెలల్లో నల్లమలలో 400 పాములు పట్టివేత
- అరుదైన సర్పజాతులకు ఆవాసంగా నల్లమల



ఆలీవ్‌కీల్ బ్యాక్ పాము

మార్కాపురం: పాము అంటే ప్రతి ఒక్కరికీ భయం. దేశంలో ఉన్న పాముల్లో అత్యంత విషపూరితమైన వాటిలో మొదటిది రక్తపింజర, తరువాత తాచు పాము, కట్లపాము. రక్తపింజర ఇటీవల కాలంలో మార్కాపురం ప్రాంతంలో ఎక్కువగా సంచరించటంతో ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిర్చి, పత్తి పొలాల్లో ఎక్కువగా సంచరిస్తున్నాయి. అత్యధికంగా నవంబర్ నెలలో మార్కాపురం ప్రాంతంలో అధికారికంగా స్నేక్ రెస్క్యూ టీం 103 పాములు పట్టుకోగా అందులో ఎక్కువగా ప్రమాదకరమైన రక్తపింజరలు ఉన్నాయి. మార్కాపురం ప్రాంతంలో ఇటీవల కాలంలో స్నేక్ వాచర్ నిరంజన్ 10 రోజుల వ్యవధిలో 8 రక్తపింజర పాములను పొలాల్లో పట్టుకున్నాడు. వేములకోటలో 4, కొండేపల్లి బ్రిడ్జి కింద 1, శివరాంపురం పొలాల్లో 1, ఎస్‌కొత్తపల్లిలో 1, పట్టణంలోని పీఎస్ కాలనీలో ఒక రక్తపింజర పామును పట్టుకున్నాడు. 5 అడుగుల పొడవుండే రక్తపింజర పాముల్లోకెల్లా అత్యంత ప్రమాదకరమైంది. కాటేసిన 40 నిమిషాల్లోపు వైద్య చికిత్స అందకపోతే చనిపోతారు. శ్వాస వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి ఒళ్లంతా చమటలు పట్టి రక్తాన్ని పలుచన చేస్తుంది. దీంతో గుండె బలహీన పడుతుంది. ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉంది. ఎక్కువగా గడ్డి, పొదలు, పత్తి, మిరప, పొగాకు, కంది చేలల్లో రక్తపింజరలు కనిపిస్తున్నాయి. దీంతో పాటు కొండచిలువలు కూడా మార్కాపురం ప్రాంతంలో జనావాసాల్లోకి వస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. 18 అడుగుల పొడవు, 90 నుంచి 100 కిలోల బరువు ఉండే కొండచిలువలు 10 రోజుల వ్యవధిలో 3 ప్రాంతాల్లో పట్టుకుని అడవుల్లో వదిలేశారు. బుడ్డపల్లిలో 2, పొదిలి దగ్గర ఒక కొండచిలువను పట్టుకున్నారు. నల్లమల అడవుల్లో నుంచి సమీప గ్రామాల్లోకి కొండ చిలువలు వస్తున్నాయి. కోళ్లు, మేకలు, కుందేళ్లు, జింకలను తింటున్నాయి. మనిషిని చుట్టేస్తే కొండచిలువ నుంచి బయటపడటం చాలా కష్టం.

పాముల పట్టివేత ఇలా:

నవంబర్ నెలలో నల్లమల పరిధిలోని శ్రీశైలంలో 15, సున్నిపెంటలో 27, మార్కాపురంలో 103, వైపాలెంలో 55, దోర్నాలలో 14, విజయపురి సౌత్‌లో 23 కలిపి మొత్తం 237 పాములను పట్టుకున్నారు. డిసెంబర్ నెలలో 163 పాములను పట్టుకున్నారు.

పాముకాటు సంఘటనలు:

- అక్టోబర్ 23న కొనకనమిట్ల మండలం గనివెనపాడులో యద్దనపూడి మరియమ్మ పాటుకాటుతో మృతిచెందింది.
- సిద్ధవరంలో ఆగస్టులో ఒకేసారి 8 మంది పాము కాటుకు గురై చికిత్స పొందారు.

విషపూరితమైనవే కాదు.. మేలు చేసేవీ ఉన్నాయి

నల్లమల అటవీ ప్రాంతంలో అరుదైన పాములు సంచరిస్తున్నాయి. ఇందులో అత్యంత విషపూరితమైన నాగుపాము, రక్తపింజర, కట్లపాము, చిన్నపింజర, కొండ చిలువలతో పాటు రైతులకు మేలు చేసే పాములు కూడా ఉన్నాయి. జర్రిపోతు, నీరుకట్టు పాము, చెక్డ్‌కిల్ బ్యాక్, బ్రౌన్‌జి, పసిరిక పాములు ఉన్నాయి. ఇవి పొలాల్లో పంటలను నాశనం చేసే ఎలుకలు, పందికొక్కులు, తొండలు, బల్లులను తిని జీవిస్తుంటాయి. కొండ చిలువ మాత్రం కుందేళ్లు, పక్షులు, కోళ్లు, చిన్న మేకలను తింటుంది. పసిరికపాము చెట్లపైనే ఉండి తొండలను, పిట్టలను తింటుంది. అత్యంత ప్రమాదకరమైన రక్తపింజర, నాగుపాము, కట్లపాము పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

పొలాల్లో పాముల సంచారం ఎక్కువ



పత్తి, మిర్చి చేలల్లో మాకు రక్తపింజర పాములు ఎక్కువగా కనిపిస్తున్నాయి. భయమైనా తప్పదు. రాత్రిపూట నీళ్ల కట్టుకునేందుకు వెళితే చాలా సార్లు రక్తపింజర, తాచుపాము, కట్లపాములు కనిపిస్తున్నాయి. జాగ్రత్తగా ఉంటున్నాం.

\- రామిరెడ్డి, రైతు

పాముకాటుకు జిల్లా వైద్యశాలలో మందు



మార్కాపురం జిల్లా వైద్యశాలలో పాముకాటుకు సంబంధించి 250 ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి నెలా 10 నుంచి 15 పాముకాటు కేసులు వస్తున్నాయి. పాము, తేలు కుట్టిన వెంటనే జిల్లా వైద్యశాలకు వస్తే సకాలంలో చికిత్స అందిస్తాం. ఆలస్యం చేయకుండా రావాలి.

\- సుబ్బారెడ్డి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్

పాములను చంపవద్దు



పాములు కనిపిస్తే ఎవరూ చంపవద్దు, మార్కాపురం అటవీశాఖ ఆధ్వర్యంలో స్నేక్ వాచర్‌ను నియమించాం. 8501068586 నంబర్‌కు సమాచారం ఇవ్వండి. పర్యావరణానికి పలురకాల పాములు మేలు చేస్తాయి.

\- విఘ్నేష్ అపావ్, డీడీ, అటవీశాఖ, మార్కాపురం



సెత్రిక పాము

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

- ప్రతి గడపకు సంక్షేమ పథకాలు వచ్చేలా చర్యలు
- 33వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఏకైక సంక్షేమ ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. ఒంగోలు నగరంలో బుధవారం 33వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయ భాస్కర రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముంగమూరు రోడ్డులోని వడ్డివానికుంట, కట్టపైన ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన 3648 కిలో మీటర్ల ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకొన్నందు వల్లే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతోందన్నారు. బాధల్లో ఉండే వారిని అక్కున చేర్చుకుంటున్న సీఎం వైఎస్ జగన్ ప్రతి ఒక్కరి మదిలో గుర్తుండిపోతున్నాడన్నారు. స్థానికులు వడ్డివాని కుంటలో పార్కుకు కేటాయించిన స్థలంలో పార్కును ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలని బాలినేనిని కోరారు. అదేవిధంగా 220 కేవీ హై టెన్షన్ సబ్ స్టేషన్‌లో నుంచి పాములు వడ్డివాని కుంటలోని ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వివరించారు. దీంతో విద్యుత్ సబ్ స్టేషన్‌కు చుట్టూ ప్రహరీ మంజూరు చేయించి పాముల సమస్యలను తీరుస్తానని స్థానికులకు బాలినేని భరోసా ఇచ్చారు. అన్నవరపు అంజయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని, ప్రభుత్వం నుంచి సాయం అందించాలని ఆయన ఇంటి వద్దకు వెళ్లినప్పుడు బాలినేనిని వేడుకున్నాడు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయిస్తానని, అందుకు సంబంధించిన ఫైల్ తయారు చేయాలని ఒంగోలు నగర మెడికల్ ఆఫీసర్‌ను బాలినేని ఆదేశించారు. స్థానికులు కొందరు ఇళ్లపట్టాల విషయమై బాలినేని దృష్టికి తీసుకొచ్చారు. మెప్మా అధికారి డీసీహెచ్ కొండయ్య ఆధ్వర్యంలో ఆర్‌పీలు, సీఓలు బాలినేనిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, ఈదర సురేష్ బాబు, శ్రీరాం నాగభూషణం, మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కండే శ్రీనివాస రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, తిర్లిక శ్రీనివాస రావు, చావల శ్రీనివాసరావు, ఎండేటి రంగారావు, బేతంశెట్టి హరిబాబు, పీవీ నాయుడు, గొర్రెపాటి శ్రీనివాస రావు, చింతగుంట్ల సువర్ణ, బొమ్మినేని మురళి, తూము పద్మ, అమ్మిశెట్టి ఆంజనేయులు, ఊసా మధు బాబు, బైరెడ్డి అరుణ, తోటపల్లి సోమశేఖర్, గోలి తిరుపతి రావు, జే.పున్నయ్య, రావులపల్లి నాగేశ్వరరావు, వైనార్టీ మహబూబ్ బాషా, పిడపర్తి మధుసూదన్ రెడ్డి, యాదాల రాజశేఖర్, బడుగు ఇందిర, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు పందిటి కాశీరామ్ (జేమ్స్), మిలిటరీ కాలనీ ఎస్‌కే నాగూర్, ఓగిరాల శ్రీనివాసులు, జయరామిరెడ్డి, కోటా రాంబాబు, నగేష్, ముంతాజ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రమాదేవి, మద్దులూరి వెంకటేశ్వర్లు, శోభ, ఏసు, బక్కా రోశయ్య, బాబూరావు, పింగల సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేషన్ విజయవంతం చేయాలి

- ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు
- కలెక్టర్ దినేష్ కుమార్



మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ఆధార్ కార్డు అప్‌డేషన్ కోసం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు ఈ నెల 19, 20, 21, 23, 24వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సచివాలయాల ద్వారా సేవలు అందించడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో కొనసాగుతుందన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు పనిచేసి ఆధార్ అప్‌డేషన్ కూడా చేయాలన్నారు. స్పందన అర్జీలను సకాలంలో చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. ఉద్యోగులంతా ఫేస్ యాప్ ద్వారా హాజరు వేసేలా చూడాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, అందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి చూడ చక్కని గ్రామాలు ఆవిష్కృతం అయ్యేలా పని చేయాలన్నారు. జలజీవన్ మిషన్, నాడు-నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. బాల్య వివాహాలు నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిలో డ్వామా పీడీ శీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ మర్దన్ అలీ, సీపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, మత్స్య శాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, పరిశ్రమల శాఖ జీఎం మధుసూదన్ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు

- అన్నీ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



గణతంత్ర దినోత్సవ వేడుక ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: గణతంత్ర దినోత్సవ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పక్కాగా చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అన్నీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వేడుకల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అతిథులను ఆహ్వానించడంలో ప్రొటోకాల్ ఉల్లఘించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీటింగ్, స్టాల్స్ ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబ సభ్యులను వేడుకలు వీక్షించేందుకు తీసుకొచ్చి వారిని సురక్షితంగా ఇంటికి చేర్చేలా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఆయా శాఖల్లో సాధించిన విజయాలను తెలిపేలా శకటాలు రూపొందించి ప్రదర్శించాలని ఆదేశించారు. నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లాలోని దూర ప్రాంత విద్యార్థులు కూడా పాల్గొనేలా చూడాలన్నారు. వేడుకలు తిలకించేందుకు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. వేడుకలు జరిగే ప్రాంగణం వద్ద వేడుకలు పూర్తయ్యే వరకు అగ్నిమాపక, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీరు, స్నాక్స్ సరఫరా చేయడంలో ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు వహించాలన్నారు. సచివాలయాల నుంచి కలెక్టరేట్ వరకు అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి వేడుకలు విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల పెన్షన్ రివిజన్ చేయాలి

- రెండు రోజులుగా ధర్నా చేస్తున్న బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: బీఎస్ఎన్ఎల్‌లో రిటైరైన ఉద్యోగుల పెన్షన్‌ను రివిజన్ చేయాలని ఎన్ఎఫ్‌టీఈ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.అంజయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు రెండో రోజు చేపట్టిన ధర్నాలో అంజయ్య మాట్లాడుతూ 2017 జనవరి ఒకటో తేదీ నుంచి పెన్షన్‌ను రివిజన్ చేయాలన్నారు. ఏఐబీఎస్ఎన్ఎల్ పీడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి బి.బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ నాయకులు ఆర్.నాగేశ్వరరావు, పి.తిరుపతి స్వామి, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, పి.వెంకటయ్య, బీవీ.సురేష్ కుమార్, పి.నిరంజన్ కుమార్, పెండ్యాల ఆంజనేయులు, పి.ఆరోగ్యం పాల్గొన్నారు.

రైతులకు అధిక ఆదాయం కల్పించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అగ్రికల్చరల్ అధికారి శ్రీనివాసరావు

మద్దిపాడు: రైతులకు ఖర్చు తగ్గించి అధిక ఆదాయం వచ్చేలా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం మద్దిపాడులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఒంగోలు సబ్‌డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు, డీఆర్‌డీఏ డీపీఎంలు, మండలంలోని వీఏఏలు, వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకుని వ్యవసాయంలో మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ వ్యవసాయం పై ఖర్చు తగ్గించి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రణాళిక తయారు చేయడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు మద్దిపాడు మండలాన్ని మోడల్ మండలంగా తీసుకున్నామని చెప్పారు. ఈ ప్రణాళికను ఏవిధంగా అమలు చేయాలి, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించే క్రమంలో తీసుకోవాల్సిన అంశాల గురించి వివరించారు. వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులను సమావేశపరిచి వారితో చర్చించి ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. డీడీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు పంటల వారీగా ప్రణాళికలు తయారు చేయడానికి సన్నద్ధమవ్వాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వీఓఏలతో సమన్వయం చేసుకుని పక్కా ప్రణాళిక తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డీఆర్‌డీఏ డీపీఎంలు డేవిడ్, సనిత మాట్లాడుతూ గతంలో (ఏపీఆర్ ఐజీపీ) ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం ద్వారా ఎఫ్‌పీఓలను తయారు చేసి రైతుల సంఘాలకు పాదుపు అలవరిచినట్లు తెలిపారు. నూతనంగా ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్) ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు సబ్‌డివిజన్ ఏడీఏ రమేష్‌బాబు మాట్లాడుతూ వీఏఏలు మద్దిపాడు గ్రామంలో ఉన్న 16 రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో ఉన్న రైతులను సమావేశపరిచి డీఆర్‌డీఏ సిబ్బందిని కలుపుకుని ప్రణాళిక తయారు చేసి గురువారం మధ్యాహ్నానికి అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, మేరీ రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘర్షణ కేసులో నిందితులు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రావు, ఎస్సై ఫణిభూషణ్

● వివరాలు వెల్లడించిన పొదిలి సీఐ

కొనకనమిట్ల: ఘర్షణలో ఓ వ్యక్తి మృతికి కారణమైన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కొనకనమిట్ల పోలీస్‌ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను పొదిలి సీఐ సుధాకర్‌రావు, ఎస్సై ఫణిభూషణ్‌ వెల్లడించారు. మండలంలోని కాట్రగుంట పంచాయతీ నర్సాయపల్లి(కొమ్ముళ్లపల్లి) ఎస్సీ కాలనీలో తాళ్లూరి వినోద్‌, తాళ్లూరి ప్రకాశం కుటుంబాల మధ్య గత కొంత కాలంగా విభేదాలున్నాయి. ప్రకాశం కుమార్తె రూతమ్మకు పింఛను రాకుండా వలంటీర్‌గా పని చేస్తున్న వినోద్‌ తమ్ముడు అడ్డుకుంటున్నాడన్న ఆరోపణపై రెండు కుటుంబాల మధ్య వైరం పెరిగింది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా తీవ్రంగా గాయపడిన వినోద్‌ ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరి కొందరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దాడి కేసుకు సంబంధించి మేకల యలమంద, ఏసేబు, గొంగటి దేవసహాయం, గొంగటి ఎస్కేలు, ప్రభుదాసు, తాళ్లూరి బెన్నిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ వెల్లడించారు. మరో 10 మంది పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.

ఏబీఎం ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కళాశాల వరండాలో ఉన్న మృతదేహం

ఒంగోలుటౌన్‌: స్థానిక ఏబీఎం జూనియర్‌ కళాశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు మృతి చెందారు. సంక్రాంతి సెలవులు కావడంతో గత వారం రోజులుగా కళాశాల మూసి ఉంది. బుధవారం పునఃప్రారంభమైంది. ఉదయం విధులకు హాజరైన ప్రిన్సిపాల్‌ జూడి వినూత్న కళాశాల వరండాలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు దోమతెర కట్టుకొని నిద్రపోయినట్లుంది. చలికి తాళలేక నిద్రలోనే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు ఏమీ లభ్యం కాలేదు. టూటౌన్‌ ఎస్సై షేక్‌ మీరా సాహెబ్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహం నిలిపివేత



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న ఎస్సై నాగేశ్వరరావు

పీసీపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహించినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగేశ్వరరావు హెచ్చరించారు. పీసీపల్లి పంచాయతీ విజయనగర కాలనీలో బుధవారం బాల్య వివాహం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సైతోపాటు ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ షేక్‌ జరీనా, స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్‌.నాయబ్‌రసూల్‌ బాలిక ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై నాగేశ్వరరావు బాలిక తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్‌ ఇచ్చి వివాహాన్ని నిలిపివేయించారు. బాల్యవివాహాలపై సమాచారం తెలిస్తే పోలీస్‌, ఐసీడీఎస్‌, స్వచ్ఛంద సంస్థలు లేదా 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారమివ్వాలని ఎస్సై కోరారు. మహిళా పోలీస్‌ ధనలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ జి.వాణీప్రియ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైపాలెం టీడీపీలో విభేదాలు

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం టీడీపీలో వర్గ విభేదాలు ఎన్టీఆర్‌ వర్ధంతి సాక్షిగా మరోమారు బహిర్గతమయ్యాయి. టీడీపీ నాయకులు వర్గాలుగా విడిపోయి బుధవారం పోటాపోటీగా ఎన్టీఆర్‌ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌ బాబు తన కార్యాలయం నుంచి, టీడీపీ సీనియర్‌ నాయకుడు డాక్టర్‌ మన్నె రవీంద్ర తన ఆస్పత్రి నుంచి వేర్వేరుగా స్థానిక కొలుకుల సెంటర్‌లోని ఎన్టీఆర్‌ విగ్రహం వద్దకు ర్యాలీగా వచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా వర్గాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాలతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పట్టణంలో జాతీయ రహదారిలోని ప్రధాన కూడలిలో ఎన్టీఆర్‌ విగ్రహం ఉంది. సాధారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అక్కడ కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ దఫా మాత్రం తమ బలాన్ని ప్రదర్శించే ఉద్దేశంతో నిత్యం రద్దీగా ఉండే కొలుకుల సెంటర్‌లో కార్యక్రమాలు చేపట్టడం విమర్శలకు తావిచ్చింది. ఇదిలా ఉండగా.. అధిష్టానం ఎవరికి టికెట్‌ ఇచ్చినా అందరూ కలిసి మద్దతు ఇవ్వాలని ఇద్దరు నేతలు పేర్కొనడంతో అనుచరులంతా అవాక్కయ్యారు.

చోరీ కేసులో దొంగకు సంకెళ్లు

● గిద్దలూరులో ఆర్మీ జవాన్‌ ఇంట్లో చోరీకి పాల్పడింది కిందింట్లో అద్దెకుంటున్న వ్యక్తే..
● నిందితుడి నుంచి 23 తులాల బంగారం ఆభరణాలు రికవరీ
● వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికా గర్గ్‌



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికాగర్గ్‌

కంభం: గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారులో ఈ నెల 16న వెలుగు చూసిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కంభం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ మలికా గర్గ్‌ వెల్లడించారు. గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారులో నివాసం ఉంటున్న వల్లంపాటి గురవమ్మ భర్త వైజాగ్‌లో ఆర్మీలో పని చేస్తున్నారు. గత నెలలో ఇంటికి తాళం వేసి వైజాగ్‌ వెళ్లిన ఆమె ఈ నెల 16వ తేదీన తిరిగి వచ్చింది. ఇంటి తాళంతోపాటు బీరువా పగలగొట్టి ఉండటం, ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ ఫిరోజ్‌ ఆధ్వర్యంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు ఎస్సైలు బ్రహ్మనాయుడు, మహేష్‌, సుబ్బరాజు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. విచారణలో భాగంగా పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు.. దొంగతనం జరిగిన ఇంటి కింద పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న పఠాన్‌ ఖాదర్‌ బాషాను నిందితుడిగా గుర్తించారు. ఈ నెల 17వ తేదీ రాత్రి కుమ్మరాం కట్ట వద్ద ఖాదర్‌బాషాను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి రూ.9,20,000 విలువైన 23 తులాల బంగారం ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును వేగంగా ఛేదించిన సీఐ, ఎస్సైలతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. సమావేశంలో అడిషనల్‌ ఎస్పీ ఎస్‌వీ శ్రీధర్‌, మార్కాపురం డీఎస్పీ కిషోర్‌కుమార్‌, కంభం, గిద్దలూరు సీఐలు ఎం.రాజేష్‌, ఫిరోజ్‌, ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, మాధవరావు, వెంకటేశ్వరనాయక్‌, బ్రహ్మనాయుడు, సుబ్బరాజు, మహేష్‌ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతోనే వరుస చోరీలు

● నిందితుడు నికరంపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌
● మార్కాపురం పట్టణ, రూరల్‌ పరిధిలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
● రూ.5 లక్షల విలువైన బంగారం ఆభరణాలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిషోర్‌కుమార్‌



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్‌ కుమార్‌, చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

మార్కాపురం: మార్కాపురం పట్టణం, రూరల్‌ మండల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని బుధవారం మార్కాపురం పట్టణ శివారులోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ డాక్టర్‌ ఎం.కిషోర్‌ కుమార్‌ తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణ పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. ఇటీవల కాలంలో మార్కాపురం పట్టణ పరిధిలో, మండలంలోని బోడపాడులో వరుస దొంగతనాలు చోటుచేసుకున్నాయి. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ, పట్టణ ఎస్సైతోపాటు పలువురు ఎస్సైలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం పట్టణ ఎస్సై శశికుమార్‌కు అజ్ఞాతవ్యక్తి ఫోన్‌లో సమాచారం చెప్పగా ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్‌ కానిస్టేబుల్‌ రామకృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరబద్ర, షరీఫ్‌, మౌలాలితో కూడిన బృందం గుండ్లకమ్మ బ్రిడ్జి వద్దకు వెళ్లారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన మీనిగ యోగయ్యగా గుర్తించారు. పట్టణంతోపాటు బోడపాడులో చోరీలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ చెప్పారు.

5 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

నిందితుడి నుంచి బంగారం నల్లపూసల దండ, 5 ఉంగరాలు, మూడు జతల కమ్మలు, చైను, గాజులు(చిన్నవి) రెండు, మాటీలు ఒక జత, పది వేల నగదు స్వాధీనం చేసుకున్నామని,, వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని డీఎస్పీ వివరించారు. నిందుతుడైన యోగయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని, చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బు కోసం తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీస్‌ సిబ్బందికి వెయ్యి రూపాయల రివార్డు అందజేశారు. సమావేశంలో సీఐ భీమానాయక్‌, ఎస్సైలు శశికుమార్‌, సువర్ణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ పరీక్షకు పటిష్టమైన ఏర్పాట్లు

● కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలు
● ఎస్పీ మలికా గర్గ్‌



పోలీస్‌ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్‌

మార్కాపురం: ఈ నెల 22న మార్కాపురంలో నిర్వహిస్తున్న పోలీస్‌ కానిస్టేబుల్‌ పరీక్షకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్‌ పేర్కొన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని తెలిపారు. ప్రతి సెంటర్‌కు ఇన్‌చార్జిగా ఒక ఎస్సైని, అలాగే మూడు సెంటర్లను ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఇన్‌స్పెక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించినట్లు చెప్పారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ను కూడా నియమించినట్లు తెలిపారు. మొత్తం 21 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామని, ఆ రోజున పట్టణంలోని అన్ని జిరాక్స్‌ సెంటర్లను మూసివేయాలన్నారు. 7,800 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తుండగా, అందులో 1400 మంది మహిళలు ఉన్నారని వివరించారు. రైల్వే స్టేషన్‌, బస్టాండ్‌లో పోలీస్‌ హెల్ప్‌ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 9 గంటలకల్లా కేంద్రాలకు రావాలని, 10 గంటల సమయం దాటితే కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హాల్‌ టికెట్‌, బాల్‌పెన్‌ తప్ప ఇతర వస్తువులు, ఎలక్ట్రానిక్‌ పరికరాలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులందరూ నియమ నిబంధనలు పాటించాలని అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 100, 112కు ఫోన్‌ చేయాలని ఎస్పీ సూచించారు.

పకడ్బందీగా నిర్వహించండి

పరీక్ష నిర్వహణ, కేంద్రాల్లో వసతులు, భద్రతా చర్యలపై 21 కేంద్రాల డిపార్టుమెంట్‌ అధికారులు, చీఫ్‌లతో స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షలో కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వివిధ పరీక్షా కేంద్రాలను, స్ట్రాంగ్‌ రూంలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఏఎస్పీ(క్రైమ్స్‌) శ్రీధరరావు, డీఎస్పీ డాక్టర్‌ ఎం.కిషోర్‌కుమార్‌, సీఐ భీమానాయక్‌, ఎస్సైలు సుమన్‌, సువర్ణ, శశికుమార్‌, లైజనింగ్‌ ఆఫీసర్‌ రాజాబాబు తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల కోసం భూముల పరిశీలన

● ఒంగోలు నగరంలోని 24 వేల మంది నిరుపేదల కోసం..
● చినమల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కలపాలెం గ్రామాల్లో 700 ఎకరాలు గుర్తింపు
● భూములను పరిశీలించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ లక్ష్మీషా



చినమల్లేశ్వరపురం గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్‌ ఎండీ లక్ష్మీ షా, జేసీ అభిషిక్త్‌ కిషోర్‌, హౌసింగ్‌ పీడీ, ఒంగోలు నగర కమిషనర్‌ తదితరులు

ఒంగోలు సబర్బన్‌: ఒంగోలు నగరంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి అవసరమైన భూములను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్‌ డైరెక్టర్‌ లక్ష్మీ షా బుధవారం పరిశీలించారు. జిల్లా పర్యటనకు వచ్చిన హౌసింగ్‌ ఎండీ లక్ష్మీ షా తొలుత ప్రకాశం భవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జాయింట్‌ కలెక్టర్‌ అభిషిక్త్‌ కిషోర్‌తో కలిసి నగర పరిసర గ్రామాల్లో పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి అనువైన భూములను పరిశీలించారు. మొత్తం 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికిగాను 500 ఎకరాలు అవసరమని ఇప్పటికే వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌కు సూచించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కొప్పోలు–అగ్రహారం మధ్యలోని చిన మల్లేశ్వరపురం గ్రామ రెవెన్యూ పరిధిలో 500 ఎకరాల భూములను హౌసింగ్‌ ఎండీ పరిశీలించారు. ఆ భూములు ఇళ్ల నిర్మాణానికి అనువైనవా, లేదా అనే అంశంపై అధికారులతో చర్చించారు. గ్రామానికి చెందిన రెవెన్యూ రికార్డులు, మ్యాపులను నిశితంగా పరిశీలించారు. అనంతరం అగ్రహారం గ్రామంలోని మరో 100 ఎకరాలు, వెంకగముక్కపాలెం గ్రామంలోని మరో 100 ఎకరాలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్‌ పీడీ ఈమని పేరయ్య, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరయ్య, తహసీల్దార్‌ మురళి, ఒంగోలు నగర కమిషనర్‌ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈ కె.మాల్యాద్రి, ఏసీపీ కె.వెంకటేశ్వర్లు, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన



సబ్‌ జూనియర్స్‌ విభాగంలో పోటీలు ప్రారంభిస్తున్న గొట్టిపాటి భరత్‌



బండ లాగుతున్న ఎడ్ల జత దృశ్యం

పర్చూరు: మండల పరిధిలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 35వ జాతీయ స్థాయి బండలాగు ఎడ్ల బలప్రదర్శన పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన సేద్య విభాగం విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, కురిచేడు మండలం, కాటంవారిపల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 5622.4 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. రాజుపాలెం మండలం, ఇనిమెట్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లజత 5568.4 అడుగుల దూరం లాగి ద్వితీయ, గుంటూరు జిల్లా, కాకుమానుకు చెందిన నల్లమోతు వీరయ్యచౌదరి ఎడ్లజత 4500 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకుంది. అలాగే ఏడు వరకు విజేతల వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి సబ్‌ జూనియర్స్‌ విభాగంలో మొత్తం 8 జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా గురజాల నియోజకవర్గ పరిశీలకులు గొట్టిపాటి భరత్‌ పాల్గొని ప్రారంభించారు. అనంతరం రైతులకు మెమోంటోలు అందజేశారు. గురువారం సాయంత్రం పెద్దసైజు విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో మంగళవారం రాత్రి జరిగిన సబ్‌ జూనియర్స్‌ విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞారెడ్డి ఎడ్లజత 4723.07 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లజత 4500 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, కృష్ణాజిల్లా, పెనమలూరుకు చెందిన భావినేని మల్లిఖార్జునరావు అండ్‌ బ్రదర్స్‌ ఎడ్లజత 4274.03 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. ఈ విభాగంలో కూడా ఏడు బహుమతులు ప్రకటించారు. బుధవారం రాత్రి సీనియర్స్‌ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం జూనియర్స్‌ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు.

ఉపాధి లభించేలా యువతకు నైపుణ్య శిక్షణ

● జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్‌ హబ్స్‌, స్కిల్‌ కాలేజీల్లో యువతకు ఉపాధి లభించేలా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ సూచించారు. బుధవారం ప్రకాశం భవనంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ.. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారికి తప్పకుండా ఉపాధి అవకాశాలు లభించాలని అన్నారు. స్థానిక పరిశ్రమల్లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని చెప్పారు. తద్వారా స్థానిక పరిశ్రమల్లోనే ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో డిమాండ్‌కు తగినట్లుగా సెక్టార్‌ వారీగా కోర్సులు ఇతర సమాచారంతో గూగుల్‌ షీట్‌ తయారు చేయాలని సూచిస్తూ ఓ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలో గతంలో జరిగిన యూత్‌ సర్వే డేటా ఆధారంగా సెక్టార్‌ వారీగా, కోర్సుల వారీగా యువత ఆసక్తి మేరకు నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక తయారు చేయాలన్నారు. విధిగా జాబ్‌ మేళాలు నిర్వహిస్తూ యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి మధుసూధన్‌రెడ్డి, ఏపీఐఐసీ జెడ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎంప్లాయిమెంట్‌ అధికారి భరద్వాజ్‌, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అధికారి లోకనాథం, మెప్మా పీడీ రవికుమార్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి అవినీతిపై విచారణ

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీలో కార్యదర్శిగా పని చేసిన చక్రవర్తి 2018–19లో అవినీతికి పాల్పడ్డట్లు ఉలవపాడు మండలం కరేడుకు చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై డీపీఓ నారాయణరెడ్డి ఆదేశాల ప్రకారం బుధవారం ఒంగోలు డీఎల్‌పీఓ ఆర్‌.పద్మ విచారణ చేపట్టారు. పకీరుపాలెంలో నిర్మించిన సిమెంటు రోడ్డుకు సంబంధించి 44,512 రూపాయలను రెండు పర్యాయాలు నిధులు డ్రా చేసినట్లు విచారణలో తేలింది. అలాగే విద్యుత్‌ బిల్లుల పేరుతో 49 వేల రూపాయలను బదిలీ అయిన తరువాత డ్రా చేసినట్లు గుర్తించామని డీఎల్‌పీఓ తెలిపారు. అయితే రూ.44,512ను కార్యదర్శితో తిరిగి కట్టించామని, కరెంటు బిల్లుల సొమ్ము సక్రమంగానే వినియోగించినట్లు తెలిపారు. విచారణ నివేదికను డీపీఓకు అందజేయనున్నట్లు డీఎల్‌పీఓ చెప్పారు. ఆమె వెంట ఈఓఆర్డీ ఎం.అంజలీదేవి, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి ఉన్నారు.